సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



వైద్యుల ఆందోళన ఉధృతం

వైద్యులకు పీజీ కోర్సుల్లో ఇన్ సర్వీస్ కోటా సీట్లు తగ్గించడాన్ని నిరసిస్తూ పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన ఆందోళనను ఉధృతం చేశారు. 8లో ▸



పంటల్లో సస్యరక్షణ చర్యలు

భారీ వర్షాలతో ముంపు బారిన పడిన పంటలను తెగుళ్లు ఆశించాయి. వీటిని అరికట్టేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. 8లో ▸



విద్యుత్‌తో భద్రం

భారీ వర్షాలు పడుతున్న ప్రస్తుత తరుణంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸

షాడో ఎమ్మెల్యేల పెత్తనం

చిన్న సారును కలవండి

- అన్నీ తామై నడిపిస్తున్న ప్రజాప్రతినిధుల తనయులు, బంధువులు
- బదిలీలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో వారిదే హవా
- పనుల నిమిత్తం వచ్చే వారిని వెళ్లి షాడోలను కలవమంటున్న ఎమ్మెల్యేలు
- మిత్రపక్ష నేతలకు దక్కని ప్రాధాన్యం
- నామినేటెడ్ పదవులపై కానరాని స్పష్టత
- రాజుకుంటున్న అసంతృప్తి జ్వాలలు



సాక్షి, భీమవరం: ఏం పనిమీద వచ్చారు.. పెద్దసారు బిజీగా ఉన్నారు.. అన్ని వ్యవహారాలు చిన్నసారే చూసుకుంటున్నారు. ఆయన్ని కలవండి.. మీ పని చేసి పెడతారు.. ఇది ప్రస్తుతం జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేల కార్యాలయాల్లో వినిపిస్తున్న మాట. బదిలీల నుంచి సెటిల్‌మెంట్ల దాకా ఏం పనికావాలన్నా షాడో ఎమ్మెల్యేల హవానే నడుస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు సైతం నిబంధనలు తుంగలోకి తొక్కి వారికే పెద్దపీట వేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు గాను సీట్ల సర్దుబాటు మేరకు నాలుగు చోట్ల టీడీపీ, మూడు చోట్ల జనసేన అభ్యర్థులు గెలుపొందారు. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల తనయులు, వారి కుటుంబసభ్యులు షాడో ఎమ్మెల్యేలుగా అవతారమెత్తారు. ఉద్యోగుల బదిలీల నుంచి ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలో అన్నీతామై చక్రం తిప్పుతున్నారు. ఇటీవల జరిగిన ఉపాధి హామీ గ్రామ సభల్లో ఎమ్మెల్యేలకు బదులుగా పలుచోట్ల వారే వేదిక లెక్కి సభలను నడిపించడం, అధికారులతో తీర్మానాలు రాయించడం గమనార్హం. వివిధ పనుల నిమిత్తం తమ వద్దకు వస్తున్న వారిని ఎమ్మెల్యేలు తమ వారిని కలవమని సూచిస్తున్నారు.

అన్నీ ఆయన కనుసన్నల్లోనే..

ఎన్నికల ముందు టీడీపీ నుంచి తమ పార్టీలో చేరిన నేతను అంతా కలసికట్టుగా గెలిపిస్తే ఇప్పుడు పెత్తనమంతా ఆయన తనయుని చేతుల్లోకి వెళ్లిపోయిందని జనసేన నేతలు అసంతృప్తితో ఉన్నారు. నియోజకవర్గంలో అన్నీ ఆయన కనుసన్నల్లోనే జరగాలంటున్నారని, ఇటీవల అధికారులు, ఉద్యోగుల బదిలీల్లోను చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ప్రధాన పట్టణంలోని క్లబ్బుల్లో జూదాల నిర్వహణపైనా ఆయనే పెత్తనం చెలాయిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో తమకు సరైన ప్రాధాన్యం లేకపోవడంపై అసంతృప్తితో టీడీపీ, జనసేనకు చెందిన కొందరు ముఖ్యనేతలు సదరు ఎమ్మెల్యేతో అంటీముట్టనట్టుగా ఉంటున్నట్టు తెలిసింది.

'నామినేటెడ్' ఆశ.. స్పష్టత లేక నిరాశ

టీడీపీ, జనసేన సీట్ల సర్దుబాటులో భాగంగా ఆశావహులు, మిత్రపక్ష నేతలకు ఎమ్మెల్సీ, ఇతర నామినేటెడ్ పోస్టులు ఇస్తామంటూ ఆశచూపి అసమ్మతిని సర్దుమణిగింప చేశారు. పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే కార్పొరేషన్లు, ఇతర నామినేటెడ్ పాలకవర్గాలను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందంటూ ఊరిస్తూ వచ్చింది. నామినేటెడ్ పదవుల కేటాయింపులపై మిత్రపక్షాల మధ్య సర్దుబాటు జరిగిందంటూ సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొట్టాయి. కాగా అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడిచిపోయినా కూటమి సర్కారు స్పష్టతనీయకపోవడం ఆశావహులను అయోమయానికి గురిచేస్తోంది. మరోపక్క షాడో ఎమ్మెల్యేల వైఖరి వారికి మింగుడు పడటం లేదు. పార్టీ పిలుపు మేరకు కూటమి అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తే షాడోలతో తమకు సరైన గుర్తింపు లేక ఉనికిని కోల్పోతున్నామని సన్నిహితుల వద్ద వాపోతున్నారు.

సోదరుడిదే హవా

జనసేన ఎమ్మెల్యే గెలుపొందిన నియోజకవర్గంలో ఆయన సోదరుడి పెత్తనంపై చర్చ ముమ్మరంగానే నడుస్తోంది. తన వద్దకు వచ్చే వారిని డైరెక్టుగా వెళ్లి తన సోదరుడిని కలవాల్సిందిగా ఎమ్మెల్యే సూచిస్తున్నారంట. అధికారులు, ఉద్యోగుల బదిలీలు ఆయన కనుసన్నల్లోనే జరిగాయంటున్నారు. నియోజకవర్గంలో కొత్తగా విధుల్లో చేరిన అధికారులు ముందు ఆయన్నే మర్యాదపూర్వకంగా కలవాల్సిన పరిస్థితి. తమకు సరైన గుర్తింపు లేదని టీడీపీ ముఖ్యనేత ఒకరు ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. స్థానికంగా వ్యతిరేకత వస్తోందని జిల్లా కేంద్రంలో కార్యాలయాన్ని తెరిచి అక్కడి నుంచి కార్యకలాపాలు సాగించే యోచనలో ఉన్నట్టు సమాచారం.

సోషల్ మీడియాలోనూ పోస్టింగ్‌లు

మంత్రి పదవి ఆశించి భంగపడిన ఓ టీడీపీ ఎమ్మెల్యే నియోజకవర్గంలోనూ మొత్తం ఆయన తనయునిదే పెత్తనంగా చెబుతున్నారు. నియోజకవర్గంలో ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభలకు ఆయనే ముఖ్య అతిథిగా హాజరై సభలను నడిపించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్టు సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టుకోవడంతో పాటు అభివృద్ధి పనులపై హామీలు సైతం ఇచ్చేస్తున్నారంటున్నారు. ఉద్యోగుల బదిలీల్లోనూ నియోజకవర్గంలోని జనసేన నేతలు సూచించిన వారికి కాకుండా తనకు అనుకూలమైన ఉద్యోగులకు విల్లింగ్ లెటర్ ఇచ్చుకోవడం రెండు పార్టీల మధ్య అగాధం నింపినట్టు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

సంరక్షణ చట్టాలను పక్కాగా అమలుచేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

భీమవరం(ప్రకాశం చౌక్): బాలలు, మహిళల సంరక్షణ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ కేశల అప్పారావు అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో బాలల, మహిళల సంరక్షణ చట్టాల అమలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు అలవాటు పడుతున్నారని ఇది దురదృష్టకరమన్నారు. బాల్య వివాహాలు వలన కలిగే నష్టాలపై కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలకు సంబంధించి సమాచారం ఉంటే చైల్డ్ హెల్ప్‌లైన్–1098కి వివరాలు తెలియజేయాలని కోరారు. భిక్షాటన ముసుగులో గంజాయి మత్తుపదార్థాల అమ్మకాలు జరుగుతున్నాయని పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. హాస్టల్‌లో విద్యార్థుల సంరక్షణ బాధ్యతల వసతి గృహాల అధికారులదే అన్నారు. కమిషన్ సభ్యులు జె.రాజేంద్రప్రసాద్, ప్రాంతీయ బాలల సంరక్షణ తనిఖీ అధికారి సీహెచ్ వెంకటపతిరాజు, జిల్లా ఐసీడీఎస్ అధికారి బి.సుజాతారాణి, సంరక్షణ అధికారి ఆర్.రాజేష్ పాల్గొన్నారు.

పరిశోధనలతో ఆక్వా పురోగతి

భీమవరం: ఆక్వాకల్చర్ ఉన్నతికి మరిన్ని పరిశోధనలు పెరగాల్సిన అవసరం ఉందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ సస్టెయినబుల్ ఇన్‌లాండ్ ఆక్వాకల్చర్ పరిశోధనా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆక్వాకల్చర్‌కు అత్యధిక ఆదాయం వచ్చేది కోస్టల్ రీజియన్‌లోనేనని ఇక్కడ పరిశోధనా కేంద్రం ఏర్పాటు అభినందనీయమన్నారు. నీటి నాణ్యత, మేనేజ్‌మెంట్, వాతావరణ మార్పుల వంటి సమస్యలు ఆక్వారంగాన్ని వెంటాడుతున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి తిరుపతి ఐఐటీలో కూడా జాతీయస్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ సాగి సత్యప్రతికవర్మ, కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడారు. వంశీ నాగరాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రామకృష్ణంరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సులభంగా ఇసుక బుకింగ్

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజలు సులభంగా ఉచిత ఇసుక పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఇసుక ఉచితంగా ఇస్తారని, రవాణా, నిర్వహణ చార్జీలు భరించాల్సి ఉంటుందన్నారు. వినియోగదారుడు సంబంధిత నిర్మాణ అనుమతులు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ద్వారా ఇసుక లభ్యతను బట్టి 24 గంటలు బుకింగ్ చేసుకునే సదుపాయం ప్రభుత్వం కల్పించిందన్నారు. అనంతరం గనులు, భూగర్భ శాఖ వద్ద నమోదైన వాహనంలో మాత్రమే ఇసుక రవాణాకు అనుమతిస్తామన్నారు. సొంత వాహనమైనా గనుల శాఖ వద్ద నమోదు తప్పనిసరి అన్నారు.

వశిష్ట వంతెన రూటు మార్చే ఆలోచనలు లేవు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

నరసాపురం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన నరసాపురం వశిష్ట వంతెన రూట్ మార్చే ఆలోచనలు లేవని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. శుక్రవారం నరసాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంతెన రూటు మారిస్తే పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, నేతలు దీనిపై ఏమైనా ప్రతిపాదనలు చేస్తే జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కోర్టులో కేసు ఉండటం వల్ల వంతెన పనులు మొదలు కాలేదని, కోర్టు కేసు అంశాన్ని పరిష్కరిస్తామన్నారు. నరసాపురం–కోటిపల్లి రైల్వే నిర్మాణ పనులకు తూర్పుగోదావరి జిల్లాలో స్థల సేకరణలో సమస్యలు ఉన్నాయన్నారు. అలాగే నరసాపురం–మచిలీపట్నం కొత్త రైల్వేలైన్ సర్వే పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. నరసాపురం నుంచి పగటిపూట వందేభారత్ రైలు నడపాలని కూడా కోరామని చెప్పారు. నరసాపురం నుంచి నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లను రెగ్యులైజ్ చేయమని కోరామని మంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరి తోలు తీస్తారు.. ఎవరు తీయించుకుంటారు?

- నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి వ్యాఖ్యలపై కౌన్సిలర్ల మండిపాటు
- న్యాయపోరాటం చేస్తామని స్పష్టం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ నాగిని తదితరులు

నరసాపురం: నరసాపురం అన్న క్యాంటీన్ ప్రారంభ కార్యక్రమంలో జరిగిన రగడలో సంబంధం లేని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లపై 'తోలు తీస్తా.. ఒళ్లు దగ్గర పెట్టుకోండి' అని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నేతలు మండిపడ్డారు. ప్రొటోకాల్ ఉల్లంఘించడమే కాకుండా మహిళా చైర్‌పర్సన్, మహిళా కౌన్సిలర్లు అని కూడా చూడకుండా నోటి దురుసుతో ప్రవర్తించిన ఎమ్మెల్యే నాయకర్ తీరుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్న క్యాంటీన్ ప్రారంభం మున్సిపాలిటీ కార్యక్రమమని, క్యాంటీన్ ఏర్పాటుకు కౌన్సిల్ తీర్మానంతో రూ.5 లక్షలను మున్సిపాలిటీ కేటాయించిందన్నారు. ప్రొటోకాల్ ప్రకారం క్యాంటీన్ వద్ద తన ఫ్లెక్సీ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌ల ఫ్లెక్సీలు పెడితే ఎమ్మెల్యే నాయకర్ దగ్గరుండి తీయించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. అలాగే క్యాంటీన్ వద్ద తమ నేతల ఫొటోలు పెట్టలేదని కూటమి నాయకులు గొడవ చేశారని, అయితే ఈ వివాదాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టడం ఎమ్మెల్యే అవివేకమన్నారు. మహిళా చైర్‌పర్సన్‌ని, మహిళా కౌన్సిలర్లమని కూడా చూడకుండా తోలు తీస్తా, ఒళ్లు దగ్గరపెట్టుకోండి, ఇంకా మీ ప్రభుత్వం అధికారంలో ఉందనుకుంటున్నారా? అంటూ ఎమ్మెల్యే స్థాయి మరిచి మాట్లాడటం దుర్మార్గమన్నారు. తాను పట్టణ ప్రథమ పౌరురాలినని, ప్రజలు ఎమ్మెల్యేను ఎలా ఎన్నుకున్నారో? తనని కూడా అలాగే ఎన్నుకున్నారన్నారు. ఎమ్మెల్యే దగ్గరుండి తమ ఫ్లెక్సీలు తొలగించడం ప్రజాస్వామ్యం కాదన్నారు. ఈ అంశంపై కోర్టుకు వెళతామని ఆమె చెప్పారు.

ఎమ్మెల్యే గారూ.. పద్ధతులు నేర్చుకోండి

వైఎస్సార్‌సీపీ సీనియర్‌నేత, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ బులిమస్తాన్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎలా పాలించాలి, ఎలా నడుచుకోవాలో, ఎలా పద్ధతిగా ఉండాలో ఎమ్మెల్యే నాయకర్ నేర్చుకోవాలన్నారు. చౌకబారు హెచ్చరికలు చేస్తే వైఎస్సార్‌సీపీ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన మూడు నెలల్లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను మూడు సార్లు ఎమ్మెల్యే బెదిరించారన్నారు. కౌన్సిల్ సమావేశంలోనూ ఇదే ధోరణితో వ్యవహించడం దారుణమన్నారు.

పవన్ కల్యాణ్ మీ తోలు తీయరా..

3వ వార్డు కౌన్సిలర్ బొంతు రాజశేఖర్ మాట్లాడుతూ క్యాంటీన్ పెట్టిన ప్రాంతం తన వార్డులో ఉందని, వార్డు కౌన్సిలర్‌గా తనకు ప్రొటోకాల్ ఉందన్నారు. మహిళా చైర్‌పర్సన్, కౌన్సిలర్లపై తోలు తీస్తానని మాట్లాడితే మహిళల గౌరవం గురించి మాట్లాడే మీ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మీ తోలు తీయరా అని ప్రశ్నించారు. సమావేశంలో కౌన్సిలర్లు పతివాడ పద్మ, ద్వారా గంగాభవానీ, మల్లాడి శేషవేణి, జిల్లెళ్ల దిలీప్, వంగా శ్రీకాంత్‌కన్నా, పార్టీ నేతలు కావలి నాని, కామన బుజ్జి, మల్లాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ప్రజలకు ఒరిగిందేంటి?



కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులయ్యిందంటూ రాష్ట్ర వ్యాప్తంగా పండుగ చేసుకుంటున్నారని అయితే రాష్ట్ర ప్రజలకు ఏమి ఒరగబెట్టారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు ప్రశ్నించారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేసి అబద్ధపు హామీలతో గద్దెనెక్కి 100 రోజుల పండుగ చేసుకుంటారా అని దుయ్యబట్టారు. వంద రోజుల్లో రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఎందరో అమాయకులను పొట్టనపెట్టుకుని ఆ కుటుంబాల్లో కన్నీళ్లు మిగిల్చారని విమర్శించారు. అలాగే వేలాది కోట్లు అప్పులు చేసి ప్రజలకు ఏం చేశారని, వరదల్లో 5 లక్షల మందిని నీట ముంచడమే కాకుండా 60 మంది ప్రాణాలు బలిగొన్నారని, లక్షకుపైగా పింఛన్లు తొలగించారని, సూపర్‌సిక్స్ హామీలను అటకెక్కించారని, వైద్య కళాశాలలకు మంగళం పాడారని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని, జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలను నిలిపివేశారంటూ మండిపడ్డారు. తల్లికి వందనం వంద రోజుల్లో ఎందుకు ఇవ్వలేకపోయారని, విద్యార్థులకు హాస్టల్ ఖర్చుల నిమిత్తం జగన్ ప్రభుత్వం అందించిన వసతి దీవెన పేరుతో రూ.20 వేలు ఎందుకు ఇవ్వలేకపోయారని నిలదీశారు. విజయవాడ వరద విపత్తును కూడా విరాళాల పేరుతో సొమ్ము చేసుకున్నారని, ఇప్పుడు ప్రజలను పక్క దారి పట్టించేలా రోజుకో కొత్త విషయాన్ని తెరమీద కు తీసుకువచ్చి నాటకం ఆడుతున్నారని దుయ్యబట్టారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్లలోని ఎస్సీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల, సీతారామపురంలోని జెడ్పీ హైస్కూల్‌ను కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్బీచర్ల పాఠశాలలో మంచినీటి సమస్య ఉందని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకురాగా చర్యలకు ఆదేశించారు. జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా పెదమైనవానిలంక డిజిటల్ కమ్యూనిటీ భవనంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్డీఓ అచ్యుత అంబరీష్ ఆమె వెంట ఉన్నారు.

అనాథలే లక్ష్యం.. అకృత్యాలే సర్వం

వసతి మాటున వంచన

- విలాసాలు పరిచయం చేస్తూ లొంగదీసుకునే ప్రయత్నం
- ఏలూరు ఆశ్రమంలో లైంగిక వేధింపుల్లో మరో కోణం
- ఆశ్రమంలో సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలించి దర్యాప్తు చేశారా?
- బాలికలతో పూర్తిగా మాట్లాడని ఏలూరు పోలీసులు
- బాపట్లకు తీసుకెళ్లింది ఎంత మందిని ?
- హాస్టల్ అనుమతులపై విచారణ ఏదీ ?
- జిల్లాలో ఇలాంటి హాస్టళ్లు ఎన్ని ఉన్నాయో ?



ఏలూరు అమీనాపేటలో స్వామి దయానంద సరస్వతి ఆశ్రమం బాలికల హాస్టల్ (ఇన్‌సెట్‌లో) నిందితుడు శశికుమార్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు అమీనాపేటలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న బాలికల వసతి గృహంలో మానవ మృగం రెచ్చిపోయింది. అభం శుభం తెలియని పసిమొగ్గలను తుంచివేస్తూ.. పైశాచికానందం పొందిన నిందితుడి అసలు రూపం బట్టబయలైంది. పేదరికంతో తల్లిదండ్రులు లేని వారు, తండ్రి లేని బాలికల చదువుకోవాలనే ఆశలపై నీళ్లు చల్లుతూ.. శశికుమార్ రూపంలో బయటకు వచ్చాడు మృగాడు. ఇప్పుడు బాలికల వసతి గృహం మూతపడటంతో ఇళ్లకు వెళ్లిన బాలికల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఓ వైపు నిందలు మోయాల్సిన దారుణమైన స్థితి, మరోవైపు తమకు జరిగిన అవమానాన్ని జీర్ణించుకోలేని దైన్యస్థితిలో బాలికలు తీవ్ర మనోవేదనతో ఉన్నారు. అయినా ఈ కేసులో పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేశారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. శుక్రవారం నిందితుడిని, మరో ఇద్దరిని అరెస్టు చేసి ఒక బాలికే ఫిర్యాదు చేసిందని పోలీసులు ప్రకటించి వివాదానికి ముగింపు పలికేలా మాట్లాడారు.

విలాసాలకు అలవాటు చేస్తూ..

ఆశ్రమంలోని బాలికలను విలాసాలకు అలవాటు చేయటం అతని స్టైల్. ఫొటో షూట్ పేరుతో కాటు వేయటం అతనికి వెన్నతో పెట్టిన విద్య. ఇదే తరహాలో ఏలూరు నగరంలో 15 ఏళ్లుగా పలువురు అమాయక బాలికలను ఫొటోలు తీయటం నేర్పుతానంటూ మచ్చిక చేసుకుంటూ తన కామానికి బలి చేస్తూ వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే తరహాలో అమీనాపేట స్వామి దయానంద సరస్వతి ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న బాలికల హాస్టల్‌ను తనకు అనువైన స్థలంగా మార్చుకున్నాడు. పక్కా స్కెచ్‌తో హాస్టల్‌లోకి తన భార్య ఫణిశ్రీ, మేనకోడలు లావణ్యలను చేర్పించాడు. గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలకు విలాసంగా ఉండేలా అలవాటు చేస్తూ.. తల్లిదండ్రులు లేని వారు, తండ్రి లేని పిల్లలను టార్గెట్‌గా చేసుకుంటూ వారితో చనువుగా ఉండటం ప్రారంభించాడు. ఫొటో షూట్ పేరుతో బాపట్ల, ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లేవాడు. ఒప్పుకొంటే సరేసరి.. లేకుంటే కాళ్లూ చేతులూ కట్టేసి మరీ తన కామవాంఛ తీర్చుకుంటూ చిన్నారుల భవిష్యత్తును నాశనం చేశాడు.

పూర్తిస్థాయిలో విచారణపై అనుమానాలు

ఏలూరు స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలోని ఒక్క బాలికపైనే నిందితుడు శశికుమార్ అత్యాచారానికి పాల్పడినట్టు పోలీసులు చెబుతున్నారు. ఇంతకీ హాస్టల్‌లోని సీసీ టీవీ ఫుటేజ్ అయినా వారు పరిశీలించారా? అనేది సందేహంగా మారింది. ఒకపక్క బాలికా సంరక్షణ అధికారి రెండు పదుల సంఖ్యలో బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడినట్టు చెప్పారు. ముగ్గురు బాలికలు ఫిర్యాదు చేశారని ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మీడియాకు వెల్లడించారు. ఈ సంఘటన వెలుగులోకి వచ్చిన మరుసటి రోజే పిల్లలను వారి ఇళ్లకు పంపేశారు. ఈ నేపథ్యంలో బాలికల బాధలను పూర్తిస్థాయిలో పోలీసులు విచారణ చేశారా? లేదా అనేది సందేహంగా మారింది. బాలికలు మీడియాకు సైతం బాహాటంగా తమ బాధను చెప్పుకున్నా.. ఆ స్థాయిలో విచారణ జరగలేదనే అనుమానం పలువురి వ్యక్తమవుతోంది.

హాస్టల్‌కు అనుమతులు ఉన్నాయా?

ఏలూరులోని శ్రీస్వామి దయానంద సరస్వతి ఆశ్రమం ట్రస్టీ ద్వారా రాష్ట్రంలో 10 వరకు వసతి గృహాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఏలూరులోని బాలికల హాస్టల్‌ను 2018లో ప్రారంభించగా కరోనా సమయంలో రెండేళ్లపాటు నిలిపివేసినట్లు చెబుతున్నారు. ఏలూరులోని హాస్టల్‌కు అసలు అనుమతులు లేకుండా ఏ విధంగా నిర్వహిస్తున్నారనేది తెలియాల్సి ఉంది. జిల్లాస్థాయి అధికారులు నిద్రపోతున్నారా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హాస్టల్ నిర్వహణపై బాలల సంరక్షణ అధికారులకు కనీస సమాచారం కూడా లేకపోవటం గమనార్హం. కానీ వారిపై ఎలాంటి చర్యలూ లేకపోవటంపై విమర్శలు వస్తున్నాయి.

ఇలాంటి హాస్టళ్లు జిల్లాలో మరెన్నో..

ఏలూరులో జరిగిన ఘోరంపై జిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఏలూరులోనే కనీసం పర్యవేక్షణ లేకపోతే ఇక జిల్లావ్యాప్తంగా అనుమతులు లేని హాస్టళ్లు ఎన్ని ఉన్నాయనేది సందేహంగా మారింది. చదువుకోవాలనే తపనతో హాస్టళ్లలో చేరుతున్న బాలికల జీవితాలను ఛిద్రం చేసేలా శశికుమార్ లాంటి మానవ మృగాలు చిదిమేయటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ, నిఘా, తనిఖీలు లేకపోవటంతో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విచారణ సైతం తూతూమంత్రంగానే చేపట్టి ఒకరో ఇద్దరినో అరెస్టులు చేసేస్తే సమస్య పరిష్కారం కాదంటున్నారు.

ఎమ్మెల్యే మాటలకు వివరణ ఇవ్వాల్సి వస్తోంది

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: సభలో ముందుగా ఎమ్మెల్యే మాట్లాడితే అది కావాలి ఇది కావాలంటున్నారు.. దానికి నేను సమాధానం చెప్పాల్సి వస్తుంది.. నేనే ముందుగా మాట్లాడితే ఎమ్మెల్యే మాటలకు వివరణ ఇవ్వాల్సి ఉండదు.. అందుకే తాను ముందుగా మాట్లాడుతున్నాను అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా భీమవరం 6వ వార్డు బొక్కావారిపాలెంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ పాల్గొని పై విధంగా మాట్లాడి ప్రసంగించి వెళ్లిపోయారు. కార్యక్రమం మొత్తం పార్టీ కార్యక్రమంలా సాగింది. నాయకుల ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప సూపర్ సిక్స్ పథకాలపై మాట్లాడలేదు. సభా వేదికపై మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి మినహా మిగిలిన వారంతా టీడీపీ, జనసేన పార్టీ నాయకులే కావడం విశేషం. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మొక్కుబడిగా మాట్లాడారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా అన్న క్యాంటీన్, విజయవాడ వరద బాధితులకు సాయంపై చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తారు.

నీరందడం లేదంటూ ఆందోళన : స్థానికుల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అపార్ట్‌మెంట్లు పెరిగిపోవడంతో తమ ఇళ్లకు తాగునీరు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాల్టీ సరఫరా చేసే నీరంతా అపార్ట్‌మెంట్లకు వెళ్లిపోవడంతో ఇతరులకు నీరు అందడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు మొక్కుబడిగా నాలుగు ఇళ్లకు తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

టీటీసీ పరీక్షా ఫలితాల విడుదల

భీమవరం: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల ఫలితాలు విడుదలైనట్టు డీఈఓ జి.నాగమణి తెలిపారు. డ్రాయింగ్, లోయర్, హయ్యర్, టైలరింగ్ మార్క్స్ మెమోలను తన కార్యాలయంలో పొందవచ్చన్నారు.

క్లుప్తంగా

తిరగబడ్డ ఇసుక ట్రాక్టర్ ట్రక్కు



తణుకు ఆర్వోబీ ప్రాంతంలో తిరగబడ్డ ఇసుక ట్రాక్టర్ ట్రక్కు

తణుకు అర్బన్: తణుకు ఆర్వోబీ సర్వీసు రోడ్డులో ఇసుక ట్రాక్టరు తిరగబడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఇసుక లోడుతో ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్తున్న ట్రాక్టరు ట్రక్కు గొయ్యిలో పడి తిరగబడింది. వెంటనే ట్రక్కులో ఉన్న ఇసుక రోడ్డుపైకి పడిపోయింది. ఆ సమయానికి ఆ ప్రాంతంలో ప్రయాణికులు ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ట్రాక్టరు డ్రైవరు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ట్రాక్టరు యజమాని స్థానికుల సాయంతో ట్రక్కును తిరిగి రోడ్డుపైకి చేర్చారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన ఉధృతం

- 23 నుంచి నిరాహార దీక్షలు
- పీజీ వైద్య కోర్సుల్లో గతంలో ఉన్న ఇన్ సర్వీస్ కోటా సీట్లను కొనసాగించాలని డిమాండ్
- స్పష్టమైన హామీ ఇవ్వని ప్రభుత్వం

తణుకు టౌన్: రాబోయే రోజుల్లో వైద్య విద్యలో పీజీలు చేసిన వారికి ఉద్యోగాలు కల్పించలేమన్న సాకుతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వైద్య కేంద్రాల్లో వైద్య సేవలందించిన వైద్యులకు పీజీ కోర్సుల్లో ఇన్ సర్వీస్ కోటా సీట్లు తగ్గించడాన్ని నిరసిస్తూ పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన ఆందోళనను ఉధృతం చేశారు. వీరికి గతంలో ఉన్న ఇన్ సర్వీస్ కోటా సీట్లను తగ్గిస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఈనెల 9వ తేదీ నుంచి పీహెచ్‌సీ వైద్యుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన చేపట్టారు. 10 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చర్చల్లో స్పష్టమైన హామీ లభించలేదని అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. సాధారణంగా వైద్య పోస్ట్ గ్రాడ్యూయేషన్ (పీజీ) కోర్సుల ప్రవేశానికి గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ వైద్యులకు నాన్ క్లీనికల్ విభాగంలో 50 శాతం, క్లీనికల్ విభాగంలో 30 శాతం సీట్లు కేటాయిస్తుండగా, ఈ ఏడాది నాన్ క్లీనికల్ విభాగంలో ఉన్న 50 శాతం సీట్లను 30 శాతానికి, క్లీనికల్ విభాగంలో ఉన్న 30 శాతం సీట్లను 15 శాతానికి టీడీపీ కూటమి ప్రభుత్వం తగ్గించింది. దీనిని నిరసిస్తూ ఆందోళనకు దిగిన పీహెచ్‌సీ వైద్యుల సంఘం నాయకులతో ప్రభుత్వం నిర్వహించిన చర్చల్లో పీహెచ్‌సీ వైద్యుల కోటా పెంచుతామని చెబుతూనే.. వైద్య విద్యలోని ఆరు బ్రాంచిలలో సీట్లను మాత్రమే కేటాయిస్తామని చెప్పడంతో వైద్యులు ఆందోళనను ఉధృతం చేశారు. ఈ సీట్ల పెంపు కూడా ఎంత శాతమో స్పష్టంగా ప్రభుత్వం చెప్పడం లేదని నాయకులు పేర్కొంటున్నారు. ఇన్ సర్వీస్ కోటా సీట్ల కుదింపుతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 240 మంది పీహెచ్సీ వైద్యులు, రాష్ట్ర వ్యాప్తంగా 2,560 మంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు నష్టపోతున్నారు.



వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కరోనాలో సేవలను మరిచి

ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్ 19 వైరస్ ప్రబలిన సమయంలో గ్రామీణ ప్రజలకు పీహెచ్‌సీ వైద్యులు తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ సేవలు అందించారు. వీరందరికీ సీట్లు ఇవ్వకపోగా గతం నుంచి ఉన్న అవకాశాలను తగ్గించి, ఉన్నత విద్యకు దూరం చేయడం అన్యాయమని పీహెచ్‌సీ వైద్యులు వాపోతున్నారు. వీరికి పీజీ కోర్సుల్లో షరతులు లేకుండా గతంలో వైద్య విద్యలోని మొత్తం 15 బ్రాంచీలలోని సీట్ల కేటాయించాలని కోరుతున్నారు.

వైద్యులందరికీ ప్రాధాన్యత ఇవ్వాలి



కోవిడ్ 19 సమయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించిన పీహెచ్‌సీ వైద్యులందరికీ పీజీ కోర్సుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. గత ప్రభుత్వాలు పీజీ కోర్సుల ప్రవేశాలకు ఎలాంటి నిబంధనలు ఉన్నప్పటికీ, ప్రమాదకర సమయాల్లో పీహెచ్‌సీ వైద్యులకు ఉన్నత విద్యలో ఆంక్షలు విధించడం, ఉన్న రిజర్వేషన్ తగ్గించడం వల్ల గ్రామీణ ప్రాంత పేదలకు వైద్య సేవలందించేందుకు ఎవరూ ముందుకు రారు. గత ప్రభుత్వం పీహెచ్‌సీ వైద్యులకు కల్పించిన 30 శాతం సీట్లను వారికి కేటాయించాలి.

– గనసాల సింగ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు, వీరభద్రపురం

హామీల్లో స్పష్టత లేదు



పీహెచ్‌సీ వైద్యులకు వైద్య పీజీ కోర్సుల్లో ఉన్న 30 శాతం రిజర్వేషన్, మరి కొన్ని సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళనలో భాగంగా ఈనెల 23 నుంచి విజయవాడలో నిరాహార దీక్షలు చేపడతాం. ఈనెల 9వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టినప్పటికీ ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఎంత శాతం సీట్లు కేటాయిస్తారనే అంశం స్పష్టత లేదు.

– డాక్టర్ కేఎంఆర్ కిషోర్, ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గంజాయి రవాణా, అమ్మకంపై పీడీ యాక్ట్

డీఐజీ అశోక్‌కుమార్



తాడేపల్లిగూడెం రూరల్: గంజాయిని తరచుగా రవాణా, అమ్మకం చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో గంజాయి రవాణా, అమ్మకంపై నిఘా పెట్టామన్నారు. ప్రధానంగా పశ్చిమగోదావరి జిల్లాలో దృష్టి సారించినట్టు చెప్పారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కేసుల నుంచి ముద్దాయి తప్పించుకోకుండా చూస్తున్నామని చెప్పారు. పోలీస్ స్టేషన్ సెట్టింగులు వేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ క్రైమ్‌లకు సంబంధించి 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, టౌన్, రూరల్ సీఐలు సుబ్రహ్మణ్యం, రమేష్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'విశ్వకర్మ యోజన'కు ఏడాది పూర్తి

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

నరసాపురం రూరల్: నేడు ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజుగా కాకుండా విశ్వకర్మ యోజన పథకం జయంతిగా గుర్తించాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం నరసాపురం మండలం పెదమైనవానిలంక డిజిటల్ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రింది స్థాయి నుంచి 18 రకాల చేతివృత్తుల వారిని గుర్తించి రూ.13 వేల కోట్లు కేటాయించినట్టు చెప్పారు. దేశంలో 81 లక్షల మంది నమోదు చేసుకోగా, ఇప్పటి వరకు 8.50 లక్షల మందికి విశ్వకర్మ యోజన పథకం ద్వారా వివిధ వృత్తుల్లో శిక్షణ ఇచ్చామని వివరించారు. పనిలో నైపుణ్యం శిక్షణ పూర్తిచేసుకున్న 6.50 లక్షల మందికి రూ.15 వేలు విలువ గల కిట్లు అందించామన్నారు. 29 రాష్ట్రాల్లో విశ్వకర్మ యోజన ట్రెనింగ్ సెంటర్లు నడుపుతున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాట్లాడుతూ పెదమైనవానిలంక గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విశ్వకర్మ యోజన పథకంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించారు. లబ్దిదారులకు యూనియన్ బ్యాంక్ భీమవరం డివిజన్ రూ.2.50 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2 కోట్ల నమూనా చెక్కులను మంత్రి చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ అచ్యుత అంబరీష్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మంగపతి, లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్ర ప్రసాద్, ఎమ్మెస్ఎంఎస్ ఎల్ఈ కేఎల్ఎస్ రెడ్డి, నెక్ ఎగ్జిక్యూటివ్ కె.ప్రేమకుమార్, శ్రీకాంత్, పి.మురళీధర్, నోడల్ ఆఫీసర్, విజయప్రతాప్, ఏడీ ఎం వసంతరావు, డీఎస్‌డీఓ ఎ.కృష్ణారెడ్డి, ఎన్నారై కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, పొత్తూరి రామరాజు, గ్రామ సర్పంచ్ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



పెదమైనవానిలంకలో విశ్వకర్మ లబ్దిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి శ్రీనివాసవర్మ


పిచ్చికుక్క స్వైరవిహారం

పోలవరం: పోలవరం గ్రామంలో పిచ్చికుక్క కరిచి ముగ్గురికి గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం గణేష్ నగర్, బీసీ కాలనీ ప్రాంతాల్లో ఇద్దరు పెద్దలు, బాలికను కుక్క కరిచింది. బాధితులకు పోలవరం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించారు.

ముంపు పంటల్లో సస్యరక్షణ చర్యలు

సాక్షి ఏలూరు : ఈ ఏడాది ఆగస్టు నెలలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన పంట అయిన వరి తర్వాత ప్రత్తి, అపరాల పంటలైన పెసర, మినుము, కంది, మొక్కజొన్న, చెరకు మొదలగు పంటలకు నష్టం వాటిల్లింది. నీట మునిగి లేదా అధిక తేమ కారణంగా పంట ఎదుగుదల ఆగిపోయింది. దీంతో వివిధ రకాల తెగుళ్లు ఆశించాయి. వీటిని అరికట్టేందుకు రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు ఇలా ఉన్నాయి.





వరి

- పంటలో నిలబడిన అదనపు నీటిని తీసివేయాలి.
- నారుమడి: ఐదు సెంట్ల నారుమడికి 1 కిలో యూరియా, 1 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయాలి. తరువాత లీటరు నీటికి 2 గ్రాముల కార్బెండిజం , మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి.
- పిలక కట్టే దశలో నీరు బయటకు తీసిన వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయడం వల్ల పంట త్వరగా పుంజుకుంటుంది. నష్టం చాలావరకు తగ్గుతుంది. ఈ వాతావరణంలో ఆశించే తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 1 గ్రాము కార్బెండిజం లేదా 2 గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి.

ప్రత్తి

- పంటలో నిలిచిన అదనపు నీటిని తీసివేయాలి.
- ఎండగా ఉన్న సమయంలో 1 నుంచి 2 శాతం పొటాషియం నైట్రేట్ (కేఎన్ఓ) ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- అనుకూల పరిస్థితులు ఏర్పడిన తర్వాత పూత, పిందె దశలో ఉన్న పంటకు ఎకరాకు 25 నుంచి 30 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎమ్ఓపీ) కలిగిన ఎరువులను బూస్టర్ మోతాదులో పైపాటుగా వేయాలి.
- ముందు జాగ్రత్త చర్యగా, 90 రోజుల పంటలో కాయ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ (సీవోసీ) 600 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలి. ఏపుగా పెరిగే దశలో (45 రోజుల వయస్సు ఉన్న పంటకు), ఆకులపై వచ్చే మచ్చ తెగుళ్ల నివారణకు కార్బెండజిమ్, మాంకోజెబ్ మిశ్రమాన్ని 2.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

మినుము, పెసర

- అధిక నీటిని బయటకు తీయాలి.
- నీరు తీసిన వారానికి ఒక్కశాతం 19:19:19 లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలి.
- ఆకులు పసుపుపచ్చగా మారితే అన్నబేది ఐదు గ్రాములు, 0.5 గ్రాములు నిమ్మ ఉప్పు లీటరు నీరు చొప్పున కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- వేరుకుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు హెక్సాకోనజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా ప్రొపికోనజోల్ 1 మిల్లీ లీటరు లీటరు నీరుతో కలిపి పిచికారీ చేయాలి.
- మారుకా కాయ తొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా నోవాల్యూరాన్ 1 మిల్లీ లీటరు / లీటరు నీటితో పిచికారీ చేయాలి.

కంది

- పొలాల్లో అధిక నీటిని బయటకు తీయాలి.
- నీరు తీసిన వారానికి ఒక్కశాతం 19:19:19 లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలి.
- ఇనుము లోప నివారణకు, సమర్ధవంతంగా పంట కోలుకోవడానికి ఫెర్రస్ సల్ఫేట్ 5.0 గ్రాములు, సిట్రిక్యాసిడ్ 0.5 గ్రాములు లీటరు నీటితో కాలిపి పిచికారీ చేయాలి.
- ఎక్కువగా ముంపునకు గురైన పొలాల్లో నీరు తగ్గిన వెంటనే 20 కిలోల యూరియా ఎకరానికి బూస్టర్ మోతాదులో వేయడం వల్ల పంట ఎదుగుదల పుంజుకుని నష్టాన్ని తగ్గించవచ్చు.

వేరుశనగ

- పొలాల నుంచి అదనపు నీటిని వెంటనే తీసివేయాలి.
- ఆకుమచ్చ తెగుళ్ల నియంత్రణకు టెబుకోనజోల్ (200 మిల్లీలీటరు / ఎకరాకు) లేదా హెక్సాకొనజోల్ 400 మి.లీ / ఎకరాకు పిచికారీ చేయాలి.
- ఐరన్ లోప నివారణకు ఫెర్రస్ సల్ఫేట్ 5 గ్రా./లీ.తో పాటు సిట్రిక్యాసిడ్ 1 గ్రా./ లీ. పిచికారీ చేయాలి.
- పంట కోతకు సిద్ధంగా ఉన్నచోట వర్షాలు ఆగే వరకు పంట కోత ఆలస్యం చేయాలి.

మొక్కజొన్న

- 48 గంటల్లో పొలంలో నిలిచిన నీటిని తీసివేయాలి.
- ఎక్కువ కాలం పంట నీట మునిగితే దిగుబడిపై ప్రభావం చూపుతుంది.
- ముంపు నీటిని తీసివేసిన తర్వాత, పంటపై 2 శాతం యూరియా (10 కిలోలు / హెక్టార్) లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ (5 కిలోలు / హెక్టారు) పిచికారీ చేయడం వల్ల పంట త్వరగా కోలుకుంటుంది.
- నీటి ముంపు, వాతావరణంలో అధిక తేమ కారణంగా వ్యాధులు (కాండం / వేరు తెగులు, గింజ బూజు తెగులు) రావడానికి అవకాశం ఉంది. కార్బెండజిమ్ 2 నుంచి 3 గ్రాములు లేదా మెటాలాక్సిల్ 35 శాతం డబ్యూఎస్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

చెరకు

- నీటి ముంపును లేత తోటలు తట్టుకోలేవు. కాలువలకు అడ్డంగా ప్రతి 24 మీటర్ల దూరానికి 60 సెం.మీ వెడల్పు, 40 సెం.మీ. లోతు గల ఇవాకతిత కాలువలను ఏర్పాటు చేయాలి. ఇవి అధిక నీటిని బయటకు పంపేందుకు తోడ్పడతాయి.
- తోటలు పడిపోకుండా జడచుట్లు వేసి మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోయాలి.
- నీటి ముంపు తగ్గిన తర్వాత బూస్టర్ డోసుగా ఎకరానికి 50 కిలోల యురియా, 25 కిలోల పొటాషియం వేసుకోవాలి.
- కొత్తవేర్లు పుట్టేందుకు దగ్గర దగ్గరగా తేలికపాటి తడులివ్వాలి.
- తెల్లఈగ నివారణకు డైమిథోఎట్ 1.7 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి.
- తోటలను ముందుగా నరికి ఫ్యాక్టరీకి తోలడం గాని, బెల్లం తయారీకి వినియోగించాలి.

వర్షా కాలం.. విద్యుత్‌తో భద్రం

యలమంచిలి: ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు పడుతున్న ప్రస్తుత తరుణంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇళ్లు, రోడ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బావుల వద్ద ముప్పు ఎక్కువ ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణ, ఆస్తి నష్టాలు తప్పవు. ముఖ్యంగా పొలాల్లో వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. వర్షంలో వైర్లు తెగిపడినట్టు గుర్తిస్తే వాటి దగ్గరకు వెళ్లకుండా విద్యుత్ శాఖ అధికారులు లేదా సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రతలు

- తడిచేతులతో తీగలు, స్విచ్లు తాకొద్దు.
- సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేయడం ప్రమాదకరం.
- నాణ్యమైన విద్యుత్ పరికరాలను వాడాలి.
- విద్యుత్ సిబ్బంది సెల్ నంబర్లు దగ్గర ఉంచుకోవాలి.
- వీధులు, పొలాల్లో తడిచిన స్తంభాలను తాకొద్దు.
- తోటలు, పొలాలు ఇతర ఏ ప్రదేశంలో అయినా విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే వెంటనే 1912కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.
- విద్యుత్ తీగలు చెట్టు తాకి ఉన్న చెట్లను ముట్టుకోవద్దు. ఆ చెట్టుకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉంది.
- వర్షం పడుతున్నప్పుడు తడిగా ఉన్న చేతులతో స్విచ్లు వేయొద్దు.
- విద్యుత్ తీగలపై బట్టలు ఆరబెట్టొద్దు.
- వర్షం పడుతున్నపుడు ఇంట్లో విద్యుత్ పోయిందని సొంత ప్రయోగాలు చేయవద్దు. విద్యుత్ పనులు అనుభవం ఉన్న వ్యక్తితో చేయించుకోవాలి.
- విద్యుదాఘాతం సంభవిస్తే వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయాలి. తర్వాత విద్యుత్ వైర్లు, షాక్‌లో ఉన్న వ్యక్తిని ప్లాస్టిక్ కర్రతో లేదా ఎండు కర్రతో వేరు చేయాలి. అనంతరం విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలి.



యలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. వర్షా కాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. తగు జాగ్రతలు పాటిస్తూ ప్రమాదాలకు గురికాకుండా ఉండాలి. వీధిలో గాలీవర్షానికి తీగలు తెగిపడితే వెంటనే మాకు సమాచారం అందించాలి. మరమ్మతులు చేస్తాం. విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

– దున్న రాజీవ్, ఎలక్ట్రికల్ ఏఈ, యలమంచిలి

పర్సు చోరీ కేసులో మహిళ అరెస్ట్

నరసాపురం: పట్టణంలోని గోదావరి పడవల రేవులో పంటుపై ప్రయాణిస్తున్న మహిళ పర్సు దొంగిలించిన కేసులో నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన అమావాస్య నర్సమ్మ అనే మహిళను శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్సై ముత్యాలరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఎల్‌బీచర్లకు చెందిన తరుమాని దుర్గాభవానీ పంటుపై సఖినేటిపల్లి నుంచి నరసాపురం వస్తుండగా నర్సమ్మ, మరో మహిళ దుర్గాభవానీ పర్సు కాజేశారు. ఈ ఘటనలో ఓ మహిళను అరెస్ట్‌చేసి, మరో మహిళ కోసం గాలిస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

ఆస్తి కోసం మహిళపై హత్యాయత్నం

నరసాపురం: ఆస్తి తగాదాల నేపథ్యంలో మహిళను గాయ పరిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై ముత్యాలరావు తెలిపారు. యలమంచిలి మండ లం ఏనుగువానిలంకకు చెందిన సామన వరలక్ష్మి ఆసుపత్రి పని నిమిత్తం శుక్రవారం నరసాపురం వచ్చింది. మామ ప్రసాద్, మరిది పెద్దిరాజులు కత్తితో ఆమెపై దాడిచేసి గాయపరిచారు. ఆస్తి విషయమై మామ, మరిదితో గొడవలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలోనే తనను చంపడానికి వారు ప్రయత్నించారని వరలక్ష్మి తన ఫిర్యాదులో పేర్కొంది.

క్లుప్తంగా

బలుసులమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. ఆలయ ఈఓ పర్యవేక్షణలో దాతల సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉండి: ప్రజా సంక్షేమం కోసం అధిక ప్రాధాన్యతనిస్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం పాములపర్రు పంట కాలువ వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలువలు ఆక్రమణకు గురి కావడం వల్లనే చెత్త కుప్పలుగా పేరుకుపోయి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉప్పుటేరుపై కోపల్లె డ్రెయిన్‌పైనా స్లూయిజ్ పనులకు ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, తహసీల్దార్ కె.నాగార్జున, ఎంపీడీవో ఎస్.రవీంద్ర, ఈవోపీఆర్డీ రామకృష్ణారెడ్డి, కార్యదర్శి కె.గోపాలకృష్ణ, సర్పంచ్ సౌజన్య బెనర్జీ, ఎంపీటీసీ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలించిన ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో నారాయణరెడ్డి

కాళ్ల: మండలం పరిధిలో 22ఏ నుంచి తొలగించిన ప్రొహిబిటెడ్ ప్రాపర్టీస్ (ఫ్రీ హోల్డ్) అసైన్డ్ భూమి, షరతులు గల పట్టాలు, ఈనాం భూములకు సంబంధించి దస్త్రాలను తాడేపల్లిగూడెం ఆర్డీవో బి.నారాయణరెడ్డి పరిశీలించారు. ఈయనను ఈ పరిశీలనకు ప్రత్యేకాధికారిగా నియమించడంతో శుక్రవారం కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, వీఆర్వోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి, దస్త్రాలను పరిశీలించారు. భూములకు సంబంధించి వివరాలను రైతుల వారీగా పూర్తి చేయలన్నారు. మరోసారి వచ్చి భూమి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నట్లు అధికారులకు తెలిపారని ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జున తెలిపారు. సమావేశంలో ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

యూపీఏ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న భీమవరం రూరల్ ఇన్‌చార్జి సీఐ కాళీ చరణ్

పాలకోడేరు: నాగరికత అభివృద్ధిలో చర్చిల పాత్ర కీలకమని భీమవరం రూరల్ ఇంచార్జి సీఐ జి.కాళీ చరణ్ ఉద్బోధించారు. మండలంలోని మో గల్లులో శుక్రవారం యునైటెడ్ పాస్టర్ల అసోసియేషన్ (యూపీఏ)సర్వసభ్య సమావేశం గోపే సాల్మన్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమవరం రూరల్ ఇంచార్జ్ సిఐ కాళీ చరణ్ పాల్గొని మాట్లాడుతూ పాస్టర్లు నెలకోసారి సమావేశమై సేవా కార్యక్రమాలను నిర్దేశించుకోవడం అభినందనీయమన్నారు. ఎస్సై ఎస్ హరిబాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలన్నారు. తొలుత విశాఖపట్నానికి చెందిన రెవరాండ్ పి.అనిల్ కుమార్ ప్రసంగించారు. పాస్టర్లు ఆకుల దానియేలు పాల్గొన్నారు.

వరద బాధితులకు విద్యార్థుల విరాళం

కాళ్ల: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు చిన్నారులు సైతం ముందుకు రావడం అభినందనీయమని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకష్ణరాజు అన్నారు. విద్యార్థులు సేకరించిన రూ.2,74,813 డీడీని ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాట్ల విజయకుమారి, శ్రీనివాస రాజు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులుగా వంచన

- హామీలు కోకొల్లలు... కలగా అమలు
- అటకెక్కిన సూపర్ సిక్స్ పథకాలు
- ఏప్రిల్ 10న తణుకులో పర్యటించిన చంద్రబాబు, పవన్



తణుకు: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు గొప్పగా ప్రకటించుకున్నారు. తణుకులో హైటెక్ టవర్ నిర్మాణం చేపడతామని, పరిశ్రమల ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు ముందు తణుకు పర్యటనలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీలతో ఊదరగొట్టారు. అయితే వీటికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. సూపర్ సిక్స్.. మీ జీవితాల్లో వెలుగులు ఫిక్స్.. ఇది మా హామీ. మెగా డీఎస్సీ.. నిరుద్యోగులకు సర్కారు కొలువు ఖాయం. ఇంటింటికీ ఓ ఉద్యోగం, ఉపాధి చూపకపోతే భృతి అందజేస్తాం. ప్రతి మహిళనూ లక్షాధికారిని చేస్తాం.. చేనేతకు చేయూత నిస్తాం.. మత్స్యకారులకు మేలు చేస్తాం.. ఒకటేమిటి అదీ, ఇదీ అన్నీ చేస్తామంటూ నాడు హామీల వర్షం కురిపించారు. అంతవరకు సంబరమే.. అయితే గద్దెనెక్కి వందరోజులు పూర్తయినా ఒకంటే ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు.

హామీలు గుప్పించి...

అధికారం కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లెక్కలేనన్ని హామీలు ఇచ్చారు. ఎన్నికల ముందు ప్రజాగళం, వారాహి, యువగళం పేరుతో ఇరువురు నేతలు ఊరూ వాడా తిరుగుతూ అలవికాని హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులకే హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తణుకు నియోజకవర్గంలో ఏ ఒక్కటీ అమలు కాలేదు. ముఖ్యంగా మెగా డీఎస్సీని వంద రోజుల్లోనే తీసుకొచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇస్తామని గొప్పగా ప్రకటించుకున్నారు. ఇకపోతే సూపర్ సిక్స్ గురించి ఊరూ వాడా ప్రచారం చేశారు. అభ్యర్థులు సైతం ×నీకు రూ. 15 వేలు, నీకు రూ. 15 వేలు, నీకు రూ. 18 వేలు అంటూ ఇంటింటికీ వెళ్లి మరీ చెప్పారు. వంద రోజులు పూర్తయ్యాక సూపర్‌సిక్స్ ఊసే లేదు. మెగా డీఎస్సీ ప్రకటనకే తప్ప కార్యరూపం దాల్చలేదు.

సూపర్ సిక్స్ అమలేదీ..?

అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఊరువాడ ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు ఆర్థిక సాయం అన్నదాత సుఖీభవ పథకం కింద అందజేస్తామన్నారు. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ. 15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తామన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు రూ. 1500లు వారి ఖాతాలకు జమ చేస్తామన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. ఇలా చెప్పిన ప్రతి పథకం అతీగతి లేదు. గత ఐదేళ్లల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పింది చెప్పినట్లుగా పక్కాగా పథకాలను అమలు చేసింది. దీంతో గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేసే అలవాటు లేదు



హామీలు ఇవ్వడమే తప్ప వాటిని నెరవేర్చే అలవాటు సీఎం చంద్రబాబుకు లేదు. వంద రోజుల పాలనలో సూపర్ సిక్స్ పథకాలు ఒక్కటి కూడా అమలు చేయకపోవడం దారుణం. పథకాలు అమలు చేయకపోగా వాటిని తప్పుదోవ పట్టించేందుకు తిరుమల లడ్డూ వ్యవహారం తెరపైకి తీసుకుచ్చారు. తిరుమల లడ్డూను అపవిత్రం చేసే దుర్బుద్ధి వైసీపీ ప్రభుత్వానికి లేదు.

– జల్లూరి జగదీష్, వ్యాపారి, తణుకు

వర్గీకరణ ప్రయత్నాలు కొనసాగిస్తే మాలల సత్తా చూపిస్తాం



మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు వర్గీకరణ ప్రయత్నాలు కొనసాగిస్తే మాలల సత్తా చూపిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హెచ్చరించారు. పట్టణంలోని అంబేడ్కర్ హాల్‌లో శుక్రవారం మాల సంఘాల జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు. మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బేతాళ శరత్ బాబు అధ్యక్షత వహించారు. మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఎస్సీల మధ్య చిచ్చుపెట్టి, లబ్ధి పొందాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు శాతం 25 వరకు పెంచటానికి ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని మంగరాజు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరారు. మాల సంఘాల జేఏసీ నాయకులు టి.ఫ్రాన్సిస్, కాంతారావు, జయరాజు, శ్యామ్ ప్రకాష్, రవి దేవాజి, సత్యకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



బల్లిపాడులో మొక్కలు నాటుతున్న దృశ్యం



ఇరగవరంలో మొక్కలు నాటుతున్న అధికారులు

అత్తిలి: కాలుష్యంతో వాతావరణం నిండిపోతున్న నేటి తరుణంలో మొక్కలే భవిష్యత్‌లో పర్యావరణాన్ని కాపాడతాయని సెక్రటరీ మనోజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ కార్యక్రమంలో పలు చోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చెరుకుమిల్లి గ్రామంలో మొక్క నాటిన సర్పంచ్ నందమూరి ప్రకాశం మాట్లాడుతూ అమ్మ మనకి జన్మనిచ్చినట్లుగానే, భవిష్యత్‌లో మొక్కలు మన ప్రాణాలను కాపాడి మరో జన్మనిస్తాయన్నారు. పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఆశ, ఏఎన్ఎంలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

ఇరగవరం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఇరగవరం మండలంలో శుక్రవారం పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు గోపిశెట్టి రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అందరూ కలిసి పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్యే శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ ముంపు నివారణ, రోడ్ల నిర్మాణం వంటి ప్రాజెక్టులను తీసుకుని పూర్తి చేసే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా రానున్న ఐదేళ్ల కాలం పనిచేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పానుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో పాటు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు తీసుకొచ్చి సర్పంచ్‌లకు గౌరవం పెంచారన్నారు. ఏ పార్టీలో గెలిచినా ప్రజాసేవకులుగా ఉండాలన్నారు. తొలుత వివిధ శాఖల పురోగతిపై ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ అంశంపై ఏవో ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు 6500 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లుగా గుర్తించామన్నారు. అలాగే, 7125 మందికి కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చినట్లు వివరించారు. సెప్టెంబరు 24, 27వ తేదీల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ గూడెం మండలంలో ఇప్పటికే ఎనిమిది గ్రామాల్లో రీ-సర్వే పూర్తయిందన్నారు. అయితే కొన్ని ఇబ్బందులు వచ్చాయన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఆయా శాఖల పనితీరుపై వాడివేడిగా చర్చ సాగింది. ఒకానొక సందర్భంలో సభ్యులు మినహా మిగిలిన వారు బయటకు వెళ్లాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా హాజరైన వారికి తెలిపారు. అయితే, మండల పరిషత్ సమావేశంలో సభ్యులు కాని వారు, ప్రజాప్రతినిధుల భర్తలు సైతం లేచి అధికారులను నిలదీయడం విస్మయానికి గురి చేసింది.

ఎన్నికల వరకే రాజకీయాలు

ఎన్నికల వరకే రాజకీయాలని, తర్వాత గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ప్రతీ సర్పంచ్ అధికారులతో మమేకం కావాలన్నారు. తద్వారా వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు. మండల సమావేశానికి చాలా తక్కువమంది సర్పంచ్‌లు హాజరుకావడంపై నిరుత్సాహం వ్యక్తంచేశారు. ప్రతి సర్పంచ్ సమావేశానికి హాజరు ప్రభుత్వ పథకాలు, సర్పంచ్‌ల బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పారిశ్రామిక, పోలీసుశాఖ సిబ్బంది కూడా సమావేశానికి హాజరయ్యేలా చూడాలన్నారు. తాడేపల్లిగూడెం మండల అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని భరోసానిచ్చారు.జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీలు సూర్పని రామకృష్ణ, కట్టా రంగబాబు, హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, పీఆర్ డీఈ వేణుగోపాల్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు పాల్గొన్నారు.

తణుకులో దంచికొట్టిన వాన



తణుకులో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం



ఈదురుగాలులతో తణుకు పట్టణాన్ని ముంచెత్తిన దుమ్ము ధూళి

తణుకు: తణుకు పట్టణంలో వర్షం దంచికొట్టింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారింది. అప్పటి వరకు ఎండతీవ్రతతో ప్రజలు ఉక్కబోతను భరించారు. అయితే ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై, ఈదురుగాలులతో జనజీవనం స్తంభించింది. ఈదురుగాలులు కారణంగా దుమ్ము ధూళితో రోడ్లు ముంచెత్తాయి. ఈ సమయంలో వాహనదారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొద్దిసేపటికే ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దాదాపు గంటపాటు కురిసిన వర్షంతో ప్రధాన రోడ్లు జలమయం అయ్యాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయం అయ్యాయి. ప్రధాన డ్రెయినేజీలు సైతం పొంగి ప్రవహించాయి. ఇదే సమయంలో స్కూళ్లు, కాలేజీలు వదలడంతోపాటు విద్యార్థులు, కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు పక్కనే వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు సైతం అవస్థలు పడ్డారు. ఇదిలా ఉంటే గత వారం రోజులుగా ఎండలు అదరగొడుతున్నాయి. వేసవిని తలపిస్తున్న ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మే నెలను తలపిస్తున్న ఎండలతో పాటు వర్షాలు కారణంగా జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

భారీ వర్షంతో నీటిమయమైన రహదారులు





తణుకు రాష్ట్రపతి రోడ్డులో వర్షపునీటిలో నిలిచిన వాహనాలు, తణుకు సజ్జాపురంలో నీటమునిగిన రోడ్డు

తణుకు అర్బన్: భారీ వర్షానికి తణుకు ప్రాంతంలోని రోడ్లన్నీ నీటమునిగాయి. శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో వచ్చిన భారీ వర్షానికి ప్రజా జీవనం అతలాకుతలమైంది. తణుకు రాష్ట్రపతి రోడ్డు, సజ్జాపురం, ఇరగవరం కాలనీ, బ్యాంక్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లో ఏకదాటిగా కురిసిన వర్షానికి రోడ్లపై నీరు నిలిచాయి, అంతేకాకుండా పాఠశాలలు విడిచిపెట్టే సమయం కావడంతో విద్యార్థులు తమ ఇళ్లకుచేరేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు పడగా, ప్రయాణికులు సైతం వర్షంలో తడుస్తూనే తమ ఇళ్లకు చేరాల్సి వచ్చింది. రాష్ట్రపతి రోడ్డులో అయితే దుకాణాల ముందు పెట్టిన వాహనాలు నీటిలోనే ఉండిపోగా వ్యాపారస్తులు తమ వ్యాపారాల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అయితే వర్షం తగ్గిన వెంటనే మునిసిపల్ పారిశుద్ధ్య సిబ్బంది డ్రెయినేజీల్లో అడ్డు పడిన చెత్త, వర్థాలను తొలగించడంతో రహదారులపై నీటి నిల్వ క్రమేపీ తగ్గింది.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా కళాశాల విద్యార్థినులు

తణుకు టౌన్: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరీబాయి చెప్పారు. శుక్రవారం తణుకు మున్సిపల్ పారిశుధ్య విభాగం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విబాగాల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పరిశుభ్రత వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు కేవీ శ్యామల దేవి, సీహెచ్ రమేష్ కుమార్, మున్సిపల్ సిబ్బంది సుభానీ, రేణుక, హమీదా, కిరణ్‌లతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్స్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉత్తమ భవిష్యత్తు



తాడేపల్లిగూడెం(టీఓసీ): కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



అత్తిలి: ఆటల పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్రీడల్లో రాణిస్తే ఉత్తమ భవిష్యత్తు సాధిస్తారని పలువురు వక్తలు తెలిపారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం రెండోవ రోజు కబడ్డీ, బాడ్మింటన్ (షటిల్) పోటీలు జరిగాయి. మండల స్థాయి సెలక్షన్స్‌లో 35 ఉన్నత పాఠశాలల నుంచి అండర్ 14, అండర్ 17విభాగాల కోసం 360 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల పీడీలు ఎస్.సరిత, బి.చంద్రశేఖర్, బి.శ్రీనివాస్, పి.చంద్రశేఖర్, ధర్మ, గంగాధర్, కె.చంద్రశేఖర్‌లు ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. ఎంపికలను కో-ఆర్డినేటర్ ఎ.ఈశ్వర్, చింతకాయల సత్యనారాయణలు పర్యవేక్షించారు.

క్రీడా పోటీలు

అత్తిలి: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సుమారు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలిచిన విజేతలు ఈ నెల 23, 24 తేదీలలో తణుకు నియోజకవర్గ స్థాయి ఆటలో పోటీలలో పాల్గొంటారు. ఈ పోటీలను మండల సమన్వయకర్త సోమయాజులు,పీడీలు తాతారావు, రమేష్ నీలవేణి, శ్రీవాణి శ్రీతల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు. అండర్ 14 లో ఖోఖోలో అత్తిలి, వాలీబాల్‌లో ఆరవల్లి, కబడ్డీలో బల్లిపాడు,యోగాలో కొమ్మర, విజేతలుగా నిలిచారు. విజేతలు అండర్-17 బాలురు విభాగంలో వాలీబాల్ లో ఆరవల్లి, కబడ్డీలో బల్లిపాడు, ఖో ఖో లో అత్తిలి, యోగాలో కొమ్మర, చెస్ లో అత్తిలి విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో యోగాలో ఆరవల్లి, ఖోఖో లో అత్తిలి బాలికల పాఠశాల, కబడ్డీలో అత్తిలి బాలికల పాఠశాల ,విజేతలుగా గెలుపొందారు.

విమానాశ్రయానికి అల్లూరి పేరు పెట్టడంపై హర్షం

భీమవరం (ప్రకాశం చౌక్): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజుగా నామకరణం చేయడం పట్ల అల్లూరి సీతారామరాజు యువజన సమాఖ్య, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరసయ్య అగ్రహారంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద యువజన సమాఖ్య ఆధ్వర్యంలో హర్షం ప్రకటిస్తూ అల్లూరికి ఘన నివాళులర్పించారు. సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం



అత్తిలి లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు

అత్తిలి: వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం అత్తిలి గ్రామంలో ఎం.ఎం.స్కూల్ రోడ్ లో నిర్వహించిన ×ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు పరిశీలించారు. డ్రెయిన్ లలో ఎక్కువ గా ప్లాస్టిక్ స్క్రాబ్ చెత్త ఉండడం వలన మురుగు నీటి పారుదలకు అంతరాయం కలిగి,దోమల పుట్టుకకు స్థావరంగా మారినట్లు గమనించినట్లు తెలిపారు. ఇదే సందర్భంలో ఫీవర్ తో బాధపడుతున్న ఇద్దరిని చూసి, తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి. మురళి పాల్గొన్నారు.

పేద విద్యార్థికీ ఆర్థిక సాయం

ఉండి: ఒక విద్యార్థికి సహాయం చేస్తే అది ఒక్కరికి మాత్రమే చేసిన సహాయం కాదని రాబోయే తరాలను మార్చేదిగా ఉంటుందని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. శుక్రవారం ఉండిలో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు దంపతులు, సూర్యకుమారి, వేగేశ్న మహేష్, నీలిమ, పెన్మత్స దిలీప్, సింధు, వేగేశ్న అనంతలక్ష్మి సంయుక్తంగా నపేద విద్యార్థి వాడపల్లి అభినయవర్మ చదవు నిమిత్తం రూ.58 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరాజు మాట్లాడుతూ దాతల సహాయాన్ని వినియోగించుకొని పట్టుదలతో చదవాలనన్నారు. కార్యక్రమంలో రుద్రరాజు నరసరాజు, గాదిరాజు రంగరాజు, బుద్దరాజు సుబ్బరాజు, బి.హరనాథరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, కలిదిండి సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.